క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా


రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పరవాడ: నెల్లూరు జిల్లా కావలిలో మార్చిలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–19 బాలుర అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు వాడచీపురుపల్లి ముత్యమాంబ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్‌కు చెందిన 10 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.నాయుడు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికను అనకాపల్లి జిల్లా రావికమతం మండలం టి.అర్జాపురం జెడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. జట్టులో కె.అనిల్, జి.మనోజ్, పి.గోపీకృష్ణ, ఆర్.ఆకాష్ తదితరులు ఎంపికైనట్టు తెలిపారు. గ్రామం నుంచి ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

భారీ అన్నసమారాధన


వడ్డన చేస్తున్న పీతల విష్ణుమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీలోని సీతారామాలయ ఉపాలయాల వార్షికోత్సవాల ముగింపు పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు, కాలనీ నిర్వాసితులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి, సింహపురి కాలనీ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు చిరంజీవీరావు, పూర్వ కార్యదర్శి నడింపల్లి రామరాజు, ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీఆర్ మూర్తి, చలపతిరావు, అప్పలనాయుడు, రామారావు తదితరులు ఏర్పాటును స్వయంగా పర్యవేక్షించారు.

ఘనంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: మాఘ ఆదివారం పురస్కరించుకుని సుజాతనగర్‌లోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. ఛాయా, ఉషా దేవేరుల సమేతంగా సూర్యనారాయణస్వామి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేసి సూర్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు.

ఇద్దరికి ఆర్థిక సాయం

మురళీనగర్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పట్టాభిరెడ్డి గార్డెన్‌కు చెందిన లక్ష్మణరావు అనే వ్యక్తికి రూ.10,000, మర్రిపాలెం మహారాణి వీధికి చెందిన నాటక కళాకారుడు తిరుమలరావుకు రూ.5,000 ఆర్థిక సాయం అందించారు.

తీరం.. జన సంద్రం

- పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు


ముత్యాలమ్మపాలెం తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పరవాడ:మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. మహాశివరాత్రి పురస్కరించుకొని శనివారం జాగరణ చేసిన భక్తులు పుణ్యస్నానాలకు తరలివచ్చారు. కొంతమంది తీరంలోనే రాత్రంతా గడిపారు. గాజువాక, అనకాపల్లి, సబ్బవరం, పెదముషిడివాడ, లంకెలపాలెం, తానాం, తాడి, పరవాడ, భర్నికం, రావాడ, కలపాక, పి.బోనంగి, గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, వెన్నలపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తీరానికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. సమీపంలో కొలువుదీరిన మహాశివుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు వెన్నల సన్యాసిరావు, పెదిశెట్టి శేఖర్, బొంది అచ్చిబాబు, దూడ అప్పారావు, చిన మసేను, మసేను శివుడిని దర్శించుకొని పూజలు జరిపి ప్రసాదం స్వీకరించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బందం పైడిరాజు, జిల్లా కార్యదర్శి బి.సోమునాయుడు, జిల్లా యూత్ అధ్యక్షుడు కొర్లయ్య పాల్గొన్నారు.

ఏర్పాట్లు భేష్

శివరాత్రి పుణ్య స్నానాలకు మునుపెన్నడూలేని విధంగా ఈ ఏడాది తీరానికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. స్టీల్ సిటీ డిపో నుంచి అదనపు బస్సులు నడిపారు. సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు పర్యవేక్షణలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తీరంలో లోతట్టు ప్రాంతాలకు వెళ్లి స్నానాలు చేసే ఆకతాయిలకు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేశారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎస్ఐలు తేజేశ్వరరావు, మల్లేశ్వరరావు, ఏఎస్ఐలు వర్మ, త్రినాథ్, శ్రీనివాస్, సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరించారు.


తీరంలో కొలువుదీరిన మహాశివుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు


జాతరలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న నాయకులు

క్లీన్‌గా చీమలాపల్లి డంపింగ్ యార్డు


శుభ్రంగా ఉన్న డంపింగ్ యార్డును నిర్వాసితులతో కలిసి పరిశీలిస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు


చెత్తతో నిండిన డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ముమ్మన(ఫైల్)

- నిర్వాసితుల హర్షాతిరేకాలు

సింహాచలం: కొద్ది రోజుల కిందట వరకు చెత్తకుప్పలతో దుర్వాసన వెదజల్లిన డంపింగ్‌యార్డు నేడు పరిశుభ్రంగా మారింది. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డ నిర్వాసితుల కళ్లలో ఆనందం కనిపించింది. తమ అవస్థలను అర్థం చేసుకుని చెత్త తొలగించడానికి కృషి చేసిన కార్పొరేటర్ ముమ్మన దేముడుతో పాటు జీవీఎంసీ అధికారులకు పరిసర ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 95వవార్డు పరిధి చీమలాపల్లి డంపింగ్ యార్డులో వ్యర్థాలు పేరుకుపోయి పరిసర ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. చెత్త తొలగించాలని టీడీపీ హయాంలో పలుమార్లు స్థానికులు, అధికారులతో పాటు టీడీపీనేతల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేటర్ ముమ్మన దేముడు జీవీఎంసీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు డంపింగ్ యార్డును పరిశీలించారు. యార్డులో ఉన్న 20 వేల టన్నుల చెత్తను కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించి సమస్యను పరిష్కరించారు. దీంతో చీమలాపల్లి, పొర్లుపాలెం, వరలక్ష్మీనగర్ ప్రాంత వాసులతో కలిసి 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదివారం డంపింగ్‌యార్డ్ వద్దకు తరలివెళ్లారు. యార్డు అంతా శుభ్రంగా ఉండడంతో వారంతా కార్పొరేటర్ ముమ్మన దేముడుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సంబంధిత 15 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయాలని కాలనీల నిర్వాసితులు కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ ఎ. ఎర్రయ్య, కె. సంతోష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాపర్తి మాధవరావు, బొడ్డు దేముడుబాబు, గంట్ల నరసింహమూర్తి, లక్ష్మి, గోపాల్, శివ, విరోతు విశ్వనాథం, వేణు, భాగ్యలక్ష్మి, వరలక్ష్మినగర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతిముత్యం సినిమా ఎన్నటికీ ఆణిముత్యమే

- ఆ చిత్ర సినిమాటోగ్రాఫర్ రఘు


మాట్లాడుతున్న సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు

ఏయూక్యాంపస్: తెలుగు సినీ చరిత్రలో స్వాతిముత్యం సినిమా ఒక ఆణిముత్యంగా నిలిచిపోతుందని సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు అన్నారు. స్వాతిముత్యం విడుదలై 37 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన రఘుతో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏయూ హిందీ భవన్‌లో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ముందుగా సినీ నటుడు తారకరత్న మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర నిర్మాణంలో దర్శకేంద్రుడు కె.విశ్వనాథ్‌తో పనిచేసిన సందర్భం, సంఘటనలను వివరించారు. విశ్వనాథ్ దర్శకత్వం, ఇళయరాజా సంగీతం సినిమాకు ప్రాణం పోశాయన్నారు. విశ్వనాథ్ ఆలోచన విధానంతో ఈ చిత్రాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దడంలో తన పాత్ర కూడా ఉండటంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా ఉన్నంత కాలం ఈ సినిమా ప్రజలకు గుర్తుంటుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా, అందరూ చూడదగిన సినిమాగా స్వాతిముత్యం ఉంటుందన్నారు. దక్షిణ భారత దేశంలో తొలి సారిగా ఆస్కార్‌కు పంపిన ఈ సినిమా ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. విశ్వనాథ్‌తో తరువాత సిరివెన్నెల సినిమాలో పనిచేయడం గొప్ప అనుభూతి కలిగిందన్నారు. ఆయన మరణం తెలుగు సినిమా పరిశ్రమకు తీరని లోటని చెప్పారు. విలేకరుల సమావేశంలో వీఎఫ్ఎస్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం సందర్శన


వసతి గృహంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న బులికృష్ణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సందర్శించారు. అక్కడి వసతులను, బాలికలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. హాస్టల్ సంక్షేమ అధికారి గిరీశ్వరి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో 687వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థ గానే కొనసాగాలన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



మాతృశ్రీనగర్ శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం


మాతృశ్రీనగర్ శివాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన శివలింగం

కూర్మన్నపాలెం: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీనగర్ శివాలయంలో మహారుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు దంపతులు పాల్గొని, కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలోని శ్రీ ఉమామార్కండేయ పద్మశాలి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాలతో స్వామిని అభిషేకించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. లింగోద్భవ సమయానికి భోళాశంకరునికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నల్ల హంసల కనువిందు


జూ పార్కు కొలనులో హుషారుగా తిరుగుతున్న నల్ల హంసలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో నల్ల హంసలు సందర్శకులను అలరిస్తున్నాయి. జూ ప్రధాన ద్వారం నుంచి లోపలకు ప్రవేశించగానే ఎదురుగా హంసల కొలను ఉంది. ఇక్కడ గతంలో ఉన్న తెల్ల హంసలు మృతి చెందడంతో వేరే రాష్ట్రంలోని జూ పార్కు నుంచి సుమారు నాలుగేళ్ల కిందట రెండు జతల నల్ల హంసలను తీసుకొచ్చారు. ఇప్పుడు వాటి సంతతి 8కి పెరిగింది. ఈ హంసలు కొలనులో రోజూ హుషారుగా షికారు చేస్తూ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. జూ యానిమల్ కీపర్లు ఈ కొలనులోనే వేర్వేరు రకాల గింజలు వేస్తుంటారు. వాటిని హంసలు తినడానికి పోటీపడుతుంటాయి. నీటిలో తేలుతున్న గింజలు తినడానికి వేగంగా ఈతకొడుతూ వాటి వద్దకు చేరుతుంటాయి. అడుగున చేరిన గింజలు తినడానికి కాళ్లు పైకి లేపి వాటి పొడవైన మెడను నీటి అడుగు భాగంలోకి దూర్చుతాయి. కొలనులో ఈ అందమైన పక్షులు చేస్తున్న విన్యాసాలను చూస్తూ సందర్శకులు ఇక్కడ కొంతసేపు గడుపుతున్నారు.

ఉత్సాహంగా విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్నపూర్వ ఉద్యోగులు

సింహాచలం: నేవల్ డాక్‌యార్డు మిషన్ షాపు విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జీవీఎంసీ 93వవార్డు పరిధి శ్రీనివాస్‌నగర్‌లో ఉత్సాహంగా జరిగింది. రిటైర్డ్ ఉద్యోగులంతానాటి తమ జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఉల్లాసంగా...ఉత్సాహంగా గడిపారు. పదవీ విరమణ అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభకనబరిచిన రిటైర్డ్ ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. విద్యావేత్తగా ఉచిత విద్యా బోధన చేస్తున్న కొండలరావుతో పాటు కళారంగంలో హాస్య ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న ఇ.ఈశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఫోర్‌మెన్ కె.ఎ.జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మొక్కలు విరివిగా నాటాలని 97వవార్డు కార్పొరేటర్ శానాపతి వసంత పిలుపునిచ్చారు. వార్డు పరిధిలోని గోపాలకృష్ణనగర్ కాలనీలో ఆదివారం ఆమె మొక్కలు నాటారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు నాటడమే శరణ్యమని తెలిపారు. భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత సమాజాన్ని అందించేందుకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని సూచించాయ. కార్యక్రమంలో శానాపతి శంకరరావు, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ శ్రీనివాసరావు, వినయ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

నూతన సేవా సంస్థ ప్రారంభం



క్లబ్ నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం నార్త్ ఈస్ట్ డైమండ్స్ లయన్స్ క్లబ్ నూతన సేవా సంస్థ ఆదివారం ప్రారంభమైంది. అధ్యక్షునిగా కంకటాల సతీష్, కార్యదర్శిగా మామిడి ప్రకాష్, కోశాధికారిగా కె. శ్రీలక్ష్మిచే ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ గవర్నర్ ఎం. ఉషారాజు ఎన్నికైన సభ్యులు నియమ నిబంధనలు పాటిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. గోపాలరావు, సీహెచ్ కృష్ణమూర్తి, వి. సాయినిర్మల, సీహెచ్ చందన, పద్మజ, టి. ఉషశ్రీ, ఎస్. సోమరాజు, సీహెచ్ కాశీ విశ్వనాథ్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం


సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులను సత్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ వృద్ధాశ్రమ 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా 2014లో వివేకానంద వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. 10వ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో గల వృద్ధులందర్నీ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ సంఘ సేవకుడు కంచర్ల రాంప్రసాద్, కంచర్ల అన్నపూర్ణ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, పరిసర ప్రాంతంలో గల పేదలకు దుప్పట్లు, తువ్వాళ్లు, పాదరక్షలు, పండ్లు అందజేశారు. వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు వృద్ధుల కోసం చక్కటి స్కిట్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామి గీతాసారం నందా స్వామి, సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఏఎస్ బీచ్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ జహీర్ అహ్మద్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, ప్రముఖ సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలు


భాష్యం పాఠశాల వద్ద పరీక్షా హాలుకు వెళ్లే ముందు తనిఖీ చేస్తున్న పోలీసులు


గోపాలపట్నం బాలాజీ పాఠశాల వద్ద అభ్యర్థులకు సూచనలిస్తున్న సీఐ సతీష్ కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తిరిగి 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. మార్నింగ్ బ్యాచ్ అభ్యర్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. గోపాలపట్నంలోని బాలాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఆదిత్య కళాశాల, బుచ్చిరాజుపాలెంలోని భాష్యం పాఠశాల, సెంట్ ఆన్స్ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులను పోలీసులు, పరీక్ష నిర్వాహకులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం లోపలికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు చేపట్టారు. 200 మీటర్ల వరకు ఎవరినీ అనుమతించలేదు. గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు స్టేషన్ల ఎస్ఐల పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

కేంద్రం దిగొచ్చే వరకు ఉక్కు ఉద్యమం


దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలో 738వ రోజు, ఆదివారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, కో–కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు, చిత్రాడ సన్యాసిరావు, టి.ఎస్.ఎన్, కె.వి.రావు, కె.శ్రీనివాస్ ప్రసంగించారు. ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న స్టీల్‌ప్లాంట్ లాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, సంస్థలోని కార్మికులు పాల్గొన్నారు.